నేడు ఉచిత వైద్య శిబిరం

అడ్డగుట్ట: డివిజన్‌లోని బాబు జగ్జీవన్‌రామ్‌ భవన్‌ కమ్యూనిటీహాలులో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు జనహిత సేవా ట్రస్ట్‌ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. జనహిత సేవా ట్రస్ట్‌, ఆశ్రయ్‌ హోమ్‌, రెయిన్‌బో హోమ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ శిబిరంలో కిమ్స్‌ ఫౌండేషన్‌ అండ్‌ రీసెర్చ్‌ సెంటర్‌ వైద్యులు ఆరోగ్య పరీక్షలు చేయనున్నారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించనున్న ఈ శిబిరంలో జనరల్‌ ఫిజీషియన్‌, ఆర్థోపెడిక్‌, పెడియాట్రిషన్‌, గైనకాలజిస్ట్‌ వైద్యులు అందుబాటులో ఉంటారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు, పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని సూచించారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ మేయర్‌ బండ కార్తీకచంద్రారెడ్డి

లాలాపేట: బీజేపీ జిల్లా కార్యదర్శి మల్లికంటి వీరన్న ఆధ్వర్యంలో తార్నాక లేబర్‌ అడ్డా వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం మాజీ మేయర్‌ బండ కార్తీక చంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్తీకరెడ్డి మాట్లాడుతూ.. బాటసారులు, ద్విచక్ర వాహనదారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సికింద్రాబాద్‌ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్‌ నాగేశ్వర్‌రెడ్డి, తార్నాక డివిజన్‌ అధ్యక్షులు ఉపేందర్‌ యాదవ్‌ పాల్గొన్నారు.

పీహెచ్‌డీతోపాటు ఉద్యోగం సాధించిన ఓయూ విద్యార్థి



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఫిజిక్స్‌ విభాగం విద్యార్థి వాంకుడోత్‌ నాగేందర్‌ పీహెచ్‌డీ డాక్టరేట్‌ పట్టాను, జూనియర్‌ లెక్చరర్‌ ఉద్యోగాన్ని సాధించాడు. ఫిజిక్స్‌ విభాగం అధ్యాపకులు డా.శ్రీనాథ్‌ రెడ్డి పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ డాక్టరేట్‌ పట్టాను అందుకున్నారు. ఇటీవల ప్రకటించిన జూనియర్‌ లెక్చరర్‌ ఉద్యోగాలలో జనగామ ప్రభుత్వ జూనియర్‌ కాలేజీలో ఫిజిక్స్‌ లెక్చరర్‌గా నియామకపత్రం అందుకున్నారు.

డా. నందిని రచనకు గిన్నిస్‌ వరల్డ్‌ రికార్డు



ఉస్మానియా యూనివర్సిటీ: ఎస్‌సీఈఆర్‌టీలో హిందీ అధ్యాపకురాలుగా పని చేస్తున్న డా.దుర్గేశ్‌ నందిని రచించిన సశక్తి దివ్యాంగ్‌ పుస్తకం గిన్నీస్‌ వరల్డ్‌ రికార్డు సాధించింది. ఈ నెల 21న ఢిల్లీలో సుమారు 25 వేల మంది వికలాంగులు హాజరైన కార్యక్రమంలో కేంద్ర మంత్రి డా.వీరేంద్ర కుమార్‌ ఆవిష్కరించినట్లు తెలిపారు. పుస్తకంలో 71 మంది వికలాంగుల జీవిత సారాంశాన్ని వివరించినట్లు పేర్కొన్నారు. సందర్భంగా గురువారం ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్‌ రమేష్‌ డా.దుర్గేశ్‌ నందినిని అభినందించారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు



కంటోన్మెంట్‌: ప్రభుత్వ స్థలాలను ఆక్రమణలను ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించబోమని కంటోన్మెంట్‌ బోర్డు సీఈఓ మధుకర్‌ నాయక్‌ అన్నారు. గురువారం కంటోన్మెంట్‌ ఆరోవార్డు పరిధిలోని పలు అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకున్నారు. రాయల్‌ ఎన్‌క్లేవ్‌ పరిధిలో ఓ వ్యక్తి పార్కు స్థలాన్ని ఆక్రమించేసి నిర్మాణం చేపట్టారు. పబ్లిక్‌ ప్రిమిసెస్‌ (ఎవిక్షన్‌ ఆఫ్‌ అనాథరైజ్డ్‌ ఆక్యుపెంట్స్‌) యాక్ట్‌, 1971 ప్రకారం నోటీసులు జారీ చేసినప్పటికీ అక్రమ నిర్మాణాన్ని యథావిధిగా కొనసాగిస్తూ వచ్చారు. దీంతో తాజాగా సదరు నిర్మాణాన్ని సీజ్‌ చేశారు. లక్ష్మీ నగర్‌ బస్తీలో రోడ్డు ఆక్రమించి నిర్మించిన మెట్లు, మరో ప్రహరీలను కూల్చేశారు. డైమండ్‌ పాయింట్‌ చౌరస్తా సమీపంలో అనుమతికి మించి చేపట్టిన అదనపు నిర్మాణాన్ని సీజ్‌ చేశారు. ఆయా కార్యక్రమాల్లో బోర్డు ఇంజనీర్‌లు సాగర్‌, దినేశ్‌, జిష్ణు, తరుణ్‌, కృష్ణకాంత్‌ రెడ్డి, ఆశిష్‌ తదితరులు పాల్గొన్నారు.

ఈ నాలుగు రోజులూ కీలకమే..!

ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న వేళ..

- ఒకవైపు ఆస్తి పన్ను టార్గెట్‌.. మరోవైపు ఎల్‌ఆర్‌ఎస్‌ గడువు ముగింపు..
- పండుగ రోజుల్లోనూ విధి నిర్వహణ



ఆస్తి పన్ను వసూళ్లు చేస్తున్న సిబ్బంది..

సనత్‌నగర్‌: ఆర్థిక సంవత్సరం మరో నాలుగు రోజుల్లో ముగియనుంది. జీహెచ్‌ఎంసీ సిబ్బందికి ఈ ఐదు రోజులు కీలకం కానుంది. అయితే ఈ ఏడాది ఆర్థిక సంవత్సరం చివరి రెండు రోజులు రంజాన్‌, ఉగాది పర్వదినాలు రావడంతో ఆయా రోజుల్లో కూడా విధులు నిర్వహించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయి. ముఖ్యంగా ఆస్తి పన్ను వసూళ్ల విషయాన్ని అధికారులు ఈ సారి సవాల్‌గా తీసుకున్నారు. అలాగే అక్రమ లే అవుట్‌ ప్లాట్ల క్రమబద్ధీకరణ (ఎల్‌ఆర్‌ఎస్‌) 25 శాతం రాయితీతో కూడిన ఫీజు చెల్లింపు గడువు కూడా ఈ నెల 31తో ముగియనుంది. చివరి రెండు రోజులు పండుగ రోజుల్లో కూడా ఎల్‌ఆర్‌ఎస్‌ ఫీజులు చెల్లించే అవకాశం కల్పించారు. ఇదిలా ఉంటే స్వచ్ఛ సర్వేక్షణ్‌ సర్వే కూడా ఇదే సమయంలో ప్రారంభం కానుండడంతో జీహెచ్‌ఎంసీ బేగంపేట సర్కిల్‌ అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో తలమునకలయ్యారు.

బేగంపేట సర్కిల్‌లో ఇంకా రూ.17 కోట్లు ఆస్తి పన్ను..

జీహెచ్‌ఎంసీ బేగంపేట సర్కిల్‌కు సంబంధించి ఆస్తి పన్ను వసూళ్లు రూ.100 కోట్లు టార్గెట్‌ కాగా ఇప్పటికి రూ.83 కోట్లు వసూలైంది. ఐదు రోజుల్లో రూ.17 కోట్లు వసూలు చేస్తే గానీ లక్ష్యాన్ని దరి చేరరు. ఈ క్రమంలో నూటికి నూరు శాతం టార్గెట్‌ను పూర్తి చేయాలనే లక్ష్యంతో చివరి ఐదు రోజులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఈ నెల 30, 31 తేదీల్లో పండుగ రోజుల్లో కూడా పన్ను వసూళ్లకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే బకాయిదారులకు డిమాండ్‌ నోటీసులు, రెడ్‌ నోటీసులు, వారెంట్లు జారీ చేశారు. 31వ తేదీ లోపు చెల్లించకపోతే వారి ఆస్తులను జప్తు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సర్కిల్‌లో బేగంపేట, రాంగోపాల్‌పేట, బన్సీలాల్‌పేట, మోండా డివిజన్లు ఉన్నాయి. సర్కిల్‌లో రైల్వేకు సంబంధించి పదుల సంఖ్యలో ప్రాపర్టీస్‌తో పలు ప్రభుత్వ రంగ కార్యాలయాలు, సంస్థలకు చెందిన భవనాలు కూడా ఉండడంతో వాటికి సంబంధించిన బకాయిలు కూడా కోట్లలో పేరుకుపోయాయి. బకాయిలు చెల్లించాలంటూ ఇప్పటికే ఆయా ప్రభుత్వ రంగ సంస్థలకు సర్కిల్‌ అధికారులు లేఖలు కూడా రాశారు. ఆస్తి పన్ను వసూళ్లకు కేవలం ట్యాక్స్‌ విభాగం సిబ్బందినే కాకుండా అన్ని సెక్షన్ల సిబ్బందిని వినియోగించుకుంటుండడంతో సిబ్బంది మొత్తం ట్యాక్స్‌ వసూళ్ల పైనే దృష్టి పెట్టారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ చెల్లింపులకు 31తో తుది గడువు..

అక్రమ లే అవుట్‌ ప్లాట్‌ క్రమబద్ధీకరణకు 25 శాతం రిబేట్‌తో ఫీజు చెల్లింపునకు ఈ నెల 31తో ముగియనుంది. ఇప్పటికే అర్హులను గుర్తించి ఫీజు చెల్లించాలంటూ ఫోన్లు కూడా చేశారు. 30, 31 తేదీల్లో కూడా ఫీజు చెల్లింపులు జరపవచ్చని డీసీ సమ్మయ్య తెలిపారు. సర్కిల్‌లో పరిధిలో 2020లో 130 మంది వరకు ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారు. వాటి పరిశీలన అనంతరం అర్హులను గుర్తించి ఫీజు చెల్లింపులు జరపాలని ఫోన్లు చేస్తున్నారు. ఇలా ఒకవైపు ప్రాపర్టీ ట్యాక్స్‌..మరోవైపు ఎల్‌ఆర్‌ఎస్‌ ఫీజులు ఫీజులు చెల్లింపులు జరిపింపచేయడంలో సిబ్బంది తలమునకయ్యారు. టార్గెట్‌లను చేరువయ్యేందుకు నానా తంటాలు పడుతున్నారు.

అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు

హర్షిత్‌, ప్రణయ్‌లకు కన్నీటి నివాళి ● కుటుంబ సభ్యులను ఓదార్చిన తలసాని



ప్రణయ్‌ మృతదేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌ యాదవ్‌

బన్సీలాల్‌పేట్‌: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హర్షిత్‌, ప్రణయ్‌ల అంత్యక్రియలు గురువారం బన్సీలాల్‌పేట్‌లో నిర్వహించారు. కుటుంబసభ్యులు, బంధువుల కన్నీటి సంద్రం మధ్య అంత్యక్రియలు జరిగాయి. బీజేఆర్‌ నగర్‌లోని హర్షిత్‌ మృతదేహాన్ని, చాచానెహ్రూనగర్‌లో దేవీప్రణయ్‌ పార్థివ దేహాలను సందర్శించి పుష్పగుచ్చాలతో శ్రద్ధాంజలి ఘటించారు. బన్సీలాల్‌పేట్‌, చాచానెహ్రూనగర్‌ ప్రాంతాల్లో తీవ్ర విశాధఛాయలు నెలకొన్నాయి. ఎంతో భవిష్యత్తు ఉన్న ఇరువురు యువకులు రోడ్డు ప్రమాదంలో మరణించడాన్ని కుటుంబీకులు, చుట్టు ప్రక్కల ప్రాంతాల ప్రజలు జీర్ణించుకోలేక కంట తడి పెట్టడం కనిపించింది. ఇరు కుటుంబాల తల్లిదండ్రులు విలపించిన తీరు చూపరుల హృదయాలను కలిచివేసింది. వీరి అంతిమయాత్ర బీజేఆర్‌ నగర్‌, చాచానెహ్రూనగర్‌ల నుంచి శ్మశానవాటిక వరకు ఊరేగింపుగా సాగింది. పెద్ద ఎత్తున స్థానిక ప్రజలు, యువకులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. హర్షిత్‌, ప్రణయ్‌ మృతదేహాలను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌ యాదవ్‌ సందర్శించి పుష్పగుచ్చాలతో నివాళులర్పించారు.

సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోండి



సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌..

సనత్‌నగర్‌: మెరుగైన వైద్యం కోసం అవసరమైన ఆర్థిక సహాయం పొందడానికి ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని సనత్‌నగర్‌ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ అన్నారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో గురువారం అమీర్‌పేట, రాంగోపాల్‌పేట డివిజన్లకు చెందిన 9 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.3.32 లక్షల విలువైన ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థిక సమస్యల కారణంగా వైద్యం అందించడంలో నిర్లక్ష్యంగా ఉండవద్దని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు శేషుకుమారి, అరుణగౌడ్‌, నాయకులు శ్రీనివాస్‌గౌడ్‌, హన్మంతరావు, సంతోష్‌ మణికుమార్‌, అశోక్‌యాదవ్‌, కూతురు నర్సింహ, బలరాం, హరిసింగ్‌, వనం శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల అంకిత భావం వల్లే మంచి ఫలితాలు



షేక్‌ రవూఫ్‌ను సత్కరించిన ఉద్యోగులు

బన్సీలాల్‌పేట్‌: భారతీయ రైల్వేలో దక్షిణ మధ్య రైల్వే అన్ని రంగాల్లో అగ్రభాగాన నిలుస్తూ మెరుగైన ఫలితాలు సాధిస్తోందని దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్‌ సంఘ్‌ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య పేర్కొన్నారు. సికింద్రాబాద్‌ బోయిగూడ రైల్‌ కళారంగ్‌లో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్మికులు, ఉద్యోగులు, సిబ్బంది నిరంతరం క్రమశిక్షణతో కష్టపడి పని చేయడం ద్వారా దక్షిణ మధ్య రైల్వే అభివృద్ధి పథంలో సాగుతుందన్నారు. ఈ పరంపరను ఉద్యోగులు కొనసాగించాలన్నారు. ఈ సందర్భంగా పదవీ విరమణ చేయనున్న సీనియర్‌ సెక్షన్‌ ఆఫీసర్‌, ఎంప్లాయిస్‌ సంఘ్‌ సహాయ కార్యదర్శి షేక్‌ రవూఫ్‌ దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్‌ చీఫ్‌ పర్సనల్‌ ఆఫీసర్‌ సిద్ధార్థ కటి, హైద్రాబాద్‌ డివిజనల్‌ మేనేజర్‌ లోకేష్‌ వైష్ణోయ్‌, ఐఏఎస్‌ అధికారి ధనుంజయ రెడ్డి పాల్గొన్నారు.

రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీల పోరాటం

ఉస్మానియా యూనివర్సిటీ: రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీల పోరాటం కొనసాగుతుందని బీజేపీ రాష్ట్ర నాయకులు ఎనుగంటి రాజు నేత అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ అన్ని రంగాలలో వెనుకబడిన బీసీలను జాగృతం చేస్తామన్నారు. జనాభా దమాషా ప్రకారం 56 శాతం గల బీసీలకు సరైన వాటా కోసం విద్యార్థి, యువజన, కుల, ఉద్యోగ సంఘాలు, ఉద్యమకారులను కలుపుకొని వెళ్తామన్నారు.

లంబాడీలకు మంత్రి పదవీ ఇవ్వాలి

ఉస్మానియా యూనివర్సిటీ: లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వాలని బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకులు, ఓయూ జాక్‌ ఛైర్మన్‌, గిరిజన చైతన్య అధ్యక్షులు డా.కరాటే రాజు గురువారం డిమాండ్‌ చేశారు. జనాభాలో 10 శాతం గల లంబాడీలకు ఒక్క మంత్రి పదవీ ఇవ్వలేదని ధ్వజమెత్తారు. లంబాడీ ఎమ్మెల్యేను మంత్రిగా నియమించకుంటే పదవులకు రాజీనామా చేయాలని కోరారు.

బస్తీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



గాంధీ నగర్‌ బస్తీలో పర్యటిస్తున్న బోర్డు సభ్యురాలు భానుక నర్మద మల్లికార్జున్‌

కంటోన్మెంట్‌: కంటోన్మెంట్‌లోని బస్తీల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని బోర్డు సభ్యురాలు భానుక నర్మద మల్లికార్జున్‌ అన్నారు. బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా నాలుగో వార్డు గాంధీ నగర్‌ బస్తీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జూబ్లీ బస్టాండ్‌ ఆవరణలోని అమ్మవారి ఆలయాన్ని పునర్నిర్మించడానికి ప్రయత్నిస్తామన్నారు. బస్తీలోని డ్రైనేజీ, అంతర్గత రోడ్లకు సంబంధించిన సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. అనంతరం వార్డు కమ్యూనిటీ హాల్‌ లో ఏర్పాటు చేసిన కాలనీ వాసుల సమావేశంలో పాల్గొని వారి సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో బస్తీ అధ్యక్షురాలు సురేఖ, నాలుగో వార్డు బీజేపీ అధ్యక్షులు సచిన్‌ ,బిజెపి సీనియర్‌ నాయకులు టోపీ శంకర్‌, విజయానంద్‌, నాగ భూషణం రెడ్డి, రాజ్‌ మల్లేష్‌, సతీష్‌ బస్తీవాసులు పాల్గొన్నారు.

పికెట్‌ పార్కులో మౌలిక సదుపాయాలు కల్పించండి



బోర్డు సభ్యురాలిని కలిసిన సీనియర్‌ సిటిజన్‌లు

కంటోన్మెంట్‌: పికెట్‌ పార్కు సందర్శకులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని హరిహర నామస్మరణ సంఘం సభ్యులు బోర్డు సభ్యురాలు భానుక నర్మదను కోరారు. గురువారం బోర్డు కార్యాలయంలో ఆమెను కలిసిన సంఘం సభ్యులు, తొలుత బోర్డు సభ్యురాలిగా నియమితులైన ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. పికెట్‌ పార్కులో తాము 60 ఏళ్లుగా గీతాపారాయణం కొనసాగిస్తున్నామని తెలిపారు. పార్కులోని రీడింగ్‌ రూమ్‌, గార్డెన్స్‌.. ఎందరో యువతీ, యువకులు చదువుకునేందుకు అనుగుణంగా ఉండేవన్నారు. వర్షాకాలంలో పార్కు జలమయం అయి, సందర్శకులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో బోర్డు అధికారులు చేపట్టిన విస్తరణ పనుల వల్ల స్థానికులకు ఎంతో ఉపయోగకరంగా మారుతోందన్నారు. సంఘం చైర్మన్‌ కొప్పునూరి బసప్ప, అధ్యక్షులు సోమ నాగరాజు, ప్రధాన కార్యదర్శి హనుమంతరావు తదితరులున్నారు.

వర్సిటీల స్వయం ప్రతిపత్తి నిర్వీర్యం



మాట్లాడుతున్న డా.రంజిత్‌

ఉస్మానియా యూనివర్సిటీ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానం (ఎన్‌ఈపీ-2020)తో యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తి నిర్వీర్యం అవుతోందని పలువురు వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఓయూ ఆర్ట్స్‌ కాలేజీలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో యూజీసీ నూతన నిబంధనలు-రాష్ట్ర ప్రభుత్వ యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తి అనే అంశం పై సదస్సు జరిగింది. కార్యక్రమానికి పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు మొగిలి వెంకట రెడ్డి అధ్యక్షత వహించగా పీడీఎస్‌యూ జాతీయ నాయకులు విజయ్‌ కన్నా, అధ్యాపకులు డా.ఉపేందర్‌, డా.దుబ్బ రంజిత్‌, సీపీఐ ఎంఎల్‌ న్యూ డెమొక్రసీ నగర కార్యదర్శి విజయ్‌, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఎన్‌ఈపీ అమలు వలన పేద వర్గాలు ఉన్నత విద్యను అందుకోలేరని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గణేష్‌, సైదులు, సుమన్‌, వంశీ, పవన్‌, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



లాలాపేట: అప్స స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఆర్యనగర్‌ కమ్యూనిటీ హాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో సికింద్రాబాద్‌ నియోజక వర్గం బీఆర్‌ఎస్‌ మహిళా సీనియర్‌ నాయకురాలు ముత్యాల గీతాదయాకర్‌రావు ముఖ్యతిథిగా పాల్గొని మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ సందర్భంగా మహిళలు వివిధ ఆటలు ఆడుతూ పాటలతో కొంత సేపు సందడిగా గడిపారు. కార్యక్రమంలో అనసూయమ్మ, సంతోషమ్మ, అప్సా ప్రాజెక్టు ఇంచార్జి బస్వరాజ్‌, కోఆర్డీనేటర్‌ మంజుల, మల్లికా, ఇందిరా, అంగన్‌వాడి టీచర్లు బాలమణి,లక్ష్మీబాయి, జయలక్ష్మీ, భాగ్య, గోదావరి తదితరులున్నారు.

ఎయిరిండియా ఉద్యోగినిపై వేధింపులు..నిందితుడి అరెస్ట్‌

సనత్‌నగర్‌: హోటల్‌లో బస చేసిన ఎయిరిండియా ఉద్యోగినిని వేధించిన వ్యక్తిని ఎస్సార్‌నగర్‌ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్‌ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన మేరకు.. కేరళకు చెందిన యువతి (29) ఎయిరిండియాలో క్రూ ఉద్యోగినిగా పనిచేస్తోంది. వ్యక్తిగత పని మీద ఈ నెల 23న నగరానికి వచ్చిన యువతి అమీర్‌పేటలోని గ్రీన్‌పార్కు హోటల్‌లో బస చేసింది. 25వ తేదీన రాత్రి హోటల్‌లోని తులిప్‌ రెస్టారెంట్‌లో భోజనం ముగించుకుని తన గదికి వెళ్లే క్రమంలో అదే రెస్టారెంట్‌లో భోజనం కోసం వచ్చిన ఉప్పల్‌కు చెందిన రాజశేఖర్‌ గౌరికార్‌ ఆమెను వెంబడించాడు. దీంతో ఆందోళనకు గురైన బాధితురాలు తన గదిలోకి వెళ్లి గడియపెట్టుకుంది. అయినప్పటికీ రాజశేఖర్‌ డోర్‌ కొట్టడం, బెల్‌ను మోగించడం చేశాడు. కొద్దిసేపు అక్కడే ఉండి డోర్‌ తీయాల్సిందిగా వేధింపులకు పాల్పడ్డ రాజశేఖర్‌ వెళ్లిపోయాడు. ఈ విషయాన్ని హోటల్‌ సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లగా వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు.

రాజ్యాంగాన్ని అవమానిస్తున్న బీజేపీ ప్రభుత్వం

లాలాపేట: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్వాతంత్ర్య సమరయోధులను, రాజ్యాంగాన్ని, రాజ్యాంగ నిర్మాతలను అవమానిస్తోందనీ తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్‌ చైర్మెన్‌ కాల్వ సుజాత అన్నారు. తార్నాక డివిజన్‌ కాంగ్రెస్‌ పార్టీ ఆధ్వర్యంలో లాలాపేటలోనీ నఫీజ్‌గార్డెన్‌లో జై బాపూ, జై భీమ్‌, జై సంవిధాన్‌ పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి సికింద్రాబాద్‌ కాంగ్రెస్‌ పార్టీ ఇంచార్జి ఆదం సంతోష్‌ కుమార్‌తో కలిసి సుజాత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికే రాహుల్‌ గాంధీ ఈ కార్యక్రమానికి దేశ వ్యాప్తంగా శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. కార్యక్రమంలో తార్నాక డివిజన్‌ అధ్యక్షుడు బ్రహ్మజీ, అమర్‌నాథ్‌గౌడ్‌, సృజన్‌, అమీర్‌ పాల్గొన్నారు.

ప్రైవేటు బ్యాంక్‌ ఉద్యోగి ఆత్మహత్య..



శశికళ (ఫైల్‌)

సనత్‌నగర్‌: ఓ ప్రైవేటు బ్యాంకులో పనిచేస్తున్న ఓ యువతి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన ఎస్సార్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్‌ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన మేరకు.. కర్నూలు జిల్లా నంద్యాలకు చెందిన పి.నర్సింహుడు కుమార్తె పెరుమాళ్ల శశికళ (24) కూకట్‌పల్లిలోని ఉజ్జీవన్‌ స్మాల ఫైనాన్స్‌ బ్యాంక్‌లో పనిచేస్తోంది. మధురానగర్‌లోని మరో స్మాల్‌ ఫైనాన్స్‌ బ్యాంకులో మేనేజర్‌గా పనిచేసే రమాదేవితో కలిసి ఎస్సార్‌నగర్‌లోని ఓ గదిలో అద్దెకు ఉంటోంది. రోజూ మాదిరిగా గురువారం ఉదయం రమాదేవి విధులకు వెళ్లగా గదిలో శశికళ ఒక్కటే ఉంది. ఇదిలా ఉండగా శశికళ మిత్రుడు రమాదేవికి ఫోన్‌ చేసి శశికళ బాధపడుతూ తనకు ఫోన్‌ చేసిందని, గదికి వెళ్లి చూడాల్సిందిగా చెప్పాడు. దీంతో రమాదేవి హుటాహుటిన గదికి వచ్చి చూడగా లోపలి నుంచి గడియ పెట్టుకుని సీలింగ్‌ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. రమాదేవి పోలీసులకు ఇవ్వడంతో పోలీసులు శశికళ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం.. రక్షించిన రైల్వే పోలీసులు

సికింద్రాబాద్‌: ఆత్మహత్యా యత్నానికి సిద్ధపడి రైలు పట్టాల మీదకు వచ్చిన ఓ గృహిణిని కాపాడిన రైల్వే పోలీసులు ఆమెకు కౌన్సెలింగ్‌ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసుల కథనం ప్రకారం.. నగరంలో నివాసం ఉంటున్న ఓ గృహిణి (40) గురువారం మధ్యాహ్నం సికింద్రాబాద్‌ రైల్వేస్టేషన్‌ సమీపంలో రైలు పట్టాలపైకి వెళుతుండడాన్ని జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్‌ పోలీసులు గుర్తించారు. వెంటనే స్పందించి ఆమెను బయటకు తీసుకువచ్చారు. భర్తకు ఉద్యోగం లేకపోగా చెడు వ్యసనాలకు బానిస కావడంతో పిల్లలతో పుట్టింటివారి దగ్గరే ఉంటున్నట్టు తెలిపింది. ఆర్థిక ఇబ్బందులు, మానసిక ఆందోళనల ఫలితంగా ఆత్మహత్య చేసుకునేందుకు రైల్వేస్టేషన్‌కు వచ్చినట్టు పోలీసులకు తెలిపింది.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్‌: రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం సికింద్రాబాద్‌ రైల్వే పీఎస్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. సాయంత్రం 5 గంటల ప్రాంతంలో సుమారు 50 సంవత్సరాల వయసున్న వ్యక్తి చర్లపల్లి-ఘట్‌కేసర్‌ రైల్వేస్టేషన్ల మధ్యకు చేరుకుని పటటాలపై పడుకున్నాడు. అదే సమయంలో వేగంగా వచ్చిన పూర్ణా ఎక్స్‌ప్రెస్‌ రైలు అతని మీది నుంచి వెళ్లడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకుని ఘటన స్థలానికి వెళ్లిన పోలీసులకు మృతుడి వివరాలు లభించలేదు.

ఐఎస్‌ఏఓ కళాశాలలో మెగా జాబ్‌ మేళా



లాలాపేట: విద్యార్థులు చదువును పూర్తి చేసుకుని వెంటనే ఉద్యోగాలను సంపాదించుకుని వెళ్లడం ఎంతో అభినందనీయం అని తార్నాక ఐఎస్‌ఓ కళాశాల చైర్మెన్‌, డైరెక్టర్‌ వినోదా వెంకటస్వామి అన్నారు. గురువారం కళాశాలలో మెగా జాబ్‌ మేళాను నిర్వహించారు. దీనికి దాదాపు 15 ప్రముఖ కంపెనీలు హాజరయ్యారు. కళాశాల విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి పలువురిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల డైరెక్టర్‌ వినోదా వెంకటస్వామి పాల్గొని జాబ్‌ మేళాలను ప్రారంభించి మాట్లాడారు. విద్యాభ్యాసంతో పాటు ఉద్యోగం, ఉపాధి అవకాశాలను కల్పించడం ఐఎస్‌ఓ కళాశాల ప్రత్యేకం అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ఉమా కొంపల్లి, డీన్‌ ఎం. మనోహర్‌, వైస్‌ ప్రిన్సిపాల్‌ రాజశ్రీ,ప్లేస్‌మెంట్‌ ఆఫీసర్‌ వినాయక ప్రసాద్‌, అనురాధ తదితరులున్నారు.

మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు



సనత్‌నగర్‌: మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్న ఇద్దరిని సనత్‌నగర్‌ పోలీసుల సహకారంతో స్పెషల్‌ టాస్క్‌ఫోర్స్‌ (ఎస్టీఎఫ్‌) బృందం అరెస్టు చేసింది. నిందితుల నుంచి 2.78 గ్రాముల ఎండీఎంఏ మాదకద్రవ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎర్రగడ్డ మెట్రోస్టేషన్‌ వద్ద డ్రగ్స్‌ అమ్మకాలు జరుగుతున్నాయనే విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్టీఎఫ్‌ సీఐ భిక్షారెడ్డి నేతృత్వంలో సిబ్బంది దాడి చేశారు. ఎండీఎంఏ విక్రయిస్తున్న మహ్మద్‌ రహీమ్‌, మహ్మద్‌ ఫక్రుద్దీన్‌లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి మాదక ద్రవ్యాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో సౌదీ అరేబియాకు చెందిన సఫాన్‌, బెంగుళూరుకు చెందిన ఇబ్రహీం, జహీర్‌లు కూడా ఉన్నట్లు గుర్తించారు. పరారీలో ఉన్న వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.